

# ఆనందానికి అవరోధం

మండల్ రెడ్డి
కృష్ణా రెడ్డి

"హలో! గుడ్ మార్నింగ్, మదీనా!"

"గుడ్‌మార్నింగ్, నజీర్!"

"బస్‌కోసం వెయిట్ చేస్తున్నారా?"

"అవునండి."

"ఇంత మందిలో మీరు బస్సు ఎలా ఎక్క గలరు?"

"ప్రయత్నిస్తాను. వీలుపడకపోతె రిక్షాయే శరణ్యం."

"రిక్షాలో వెళ్ళితే కాలేజి టైం దాటిపోతుంది. కులం చెడినా సుఖం దక్కదు."

"మరి ... ఎలా వెళ్ళడం?"

"కండక్టర్ కాస్త పరిచయం ఉన్నవాడే. రిక్వెస్ట్ చేస్తాను."

"మీవరకేనా? నాకు కూడానా?"

"ఇద్దరికి."

"అలాగైతే మీకు మెనీ మెనీ థాంక్స్!"

"ఇప్పుడే ఎందుకు? సీటు దొరికిన తరవాత చెప్పండి!"

"ఆ! అయితే అదీ ఉట్టిదేనా?"

"ఏదైంది బస్సు వచ్చిన తరవాత చెబుతాను."

"మీకు పుణ్యముంటుంది. రిక్షా ఎక్కి వెళ్ళ మని మాత్రం చెప్పకండి!"

"మంచిది."

"అంటే?"

"అదిగో, బస్సు వస్తూంది. తరవాత చెబుతాను."

గాడిదలాగా హోంఢ్రపెడుతూ బస్సు మెమ్మదిగా వచ్చి ఆగింది. జనం జోరీగల్లాగా బస్సుచుట్టూ మూగారు. బస్సు లోపలి వాళ్ళు దిగక ముందే బయటి వాళ్ళు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. అందువల్ల బస్సు దిగే వాళ్ళు దిగలేకపోతున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కలేక పోతున్నారు. ఫలితంగా ఇరు పక్షాల వారికి చిన్న యుద్ధం ప్రారంభమైంది. చివరికి ఒకరి నొకరు తిట్టుకుని, తన్నుకుని, గుద్దు కుని ఎలాగో అందరూ బస్సెక్కారు.

అందరికంటె ముందుగా మదీనా బస్సెక్కింది. టికెట్ తీసుకుని చరచరా వెళ్ళి కిటికీ పక్కగా కూర్చుంది. తన పక్కన కర్‌ఛీఫ్ పెట్టి నజీర్‌కోసం సీటు ఉంచింది.

మదీనా వెనకాలే నజీర్ బస్సెక్కాడు. టికెట్ తీసుకొని, చుట్టూ చూశాడు. ఎక్కడా సీట్లు ఖాళీగా లేవు. విధిలేక హేంగర్ పట్టుకొని నిలుచున్నాడు.

"కూర్చోండి" అంది మదీనా, తన పక్క సీటు చూపిస్తూ.

మదీనా పక్కను సీటు ఖాళీగానే ఉంది. కాని, మదీనా పక్కను కూర్చోవడం ఎలా? మదీనా పెళ్ళి కాని యువతి. తను పెళ్ళికాని యువకుడు. ఎంత స్నేహంగా ఉన్నా, పరాయి స్త్రీ పక్కను కూర్చోవడం పద్ధతిగా ఉంటుందా? నజీర్ తటపటాయించాడు.

"కూర్చోండి అంటే నిలబడిఆలోచిస్తున్నారేం?" మళ్ళీ అంది మదీనా.

"ఎందుకులెండి. నేను నిలుచుంటాను." అన్నాడు నజీర్.

"ఫర్వాలేదు, కూర్చోండి." మదీనా బలవంతం చేసింది.

నజీర్ ఇక కాదనలేకపోయాడు. జంకుతూనే మదీనా పక్కను కూర్చున్నాడు. కూర్చున్న తరవాత అదొక విధమైన అనుభూతిని పొందాడు. తలఎత్తి చుట్టూ చూశాడు. అందరూ తనవేపు చూస్తున్నందుకు సిగ్గుపడిపోయాడు.

బస్సు కదిలింది

"బస్సులో కూడా ఈ పట్టింపు లేమిటండీ?" అంది మదీనా.

"పట్టింపులు లేకపోతే పరువుపోతుందేమోనని భయం" అన్నాడు నజీర్.

"ఎందుకని?"

"ఎందు కేమిటి? మన కాలేజి స్టూడెంట్స్ చూశారంటే రేపే మన పేర్లు గోడల మీద కెక్కుతాయి."

"అదా మీ భయం! మన మనసు మంచిదై నప్పుడు ఎవరికి భయపడవలసిన పనిలేదండి."

"లోకం చూసేది మన ప్రవర్తనను కాని, మన

మనసును కాదుగదా?"

"అయితే యువతీ యువకులు సరదాగా మాట్లాడుకోవడం కూడా తప్పే నంటారా?"

"తప్పని నే ననడం లేదు. లోకం తీరు చెబుతున్నాను."

"తప్పు కానప్పుడు లోకానికి భయపడడం ఎందుకు? లోకానికి భయపడితే మనం ఏ పని చేయలేమండి. లోకం బాగుపడితే ఏడుస్తుంది. చెడిపోతే నవ్వుతుంది."

"అలా అని లోకం మాట కూడా పూర్తిగా తీసి వేయడం మంచిది కాదేమోననిపిస్తుంది."

"ఎందుకని?"

"యువతీ యువకులు పెళ్ళి చేసుకోకుండా మరీ విచ్చలవిడిగా ప్రవర్తించడం కూడా మంచిది కాదని హెచ్చరిక చేసినట్లుగా మాత్రం ఎందుకనుకో కూడదు?"

"పెళ్ళిచేసుకోకపోతే మాత్రం యువతీ యువకులు స్నేహంగా ఉండకూడదా?"

"స్నేహంగా ఎందుకు ఉండ కూడదు? కాని, స్నేహం ప్రేమగా మారితే, ప్రేమ పెళ్ళిదాకావస్తే, పెళ్ళి భగ్నమయి పోతేనే ప్రమాదం. అందుకని పెళ్ళి చేసుకుంటే ఏ చిక్కు ఉండదు. ఇరువురికి క్షేమం కూడాను."

పెళ్ళి ప్రసక్తి రాగానే మదీనా ముఖం ముడుచుకుంది. తనకు పెళ్ళి కాలేదని ఎవరో వెక్కిరిస్తున్నట్లుగా బాధపడింది. పెళ్ళి గురించి పరిపరివిధాలా ఆలోచించసాగింది. అవును. నజీర్ అన్న మాటలు అక్షరాలా నిజం. ఆడదానికి పెళ్ళికాకపోతే రక్షణ ఉండదు. సమాజంలో గౌరవ మర్యాద లుండవు. ప్రతివారికి లోకువగా కనిపిస్తుంది. సమయంచూసి వంచన చేయాలని ప్రతివాడు ప్రయత్ని స్తుంటాడు. కాబట్టి తను క్షేమంగా, గౌరవంగా బ్రతకాలంటే పెళ్ళి చేసుకోవాలి. తన ఈడు వాళ్ళంతా ఏనాడో పెళ్ళిచేసుకుని పిల్లలను కన్నారు. కొందరు ఆపరేషన్ కూడా చేయించుకున్నారు. కాని, తనకు ఇంతవరకు పెళ్ళి కాలేదు. ఇప్పుడు తనను ఎవరు పెళ్ళిచేసుకుంటారు? ... నజీర్‌కు పెళ్ళి కాలేదు. తెలివికల వాడు. ఉద్యోగం చేస్తున్నాడు. తనతో చనువుగా ఉంటున్నాడు ... తనను పెళ్ళిచేసుకుంటాడేమో? ...

బస్సు ఆగింది

"నిద్ర పోతున్నారా? కాలేజి వచ్చేసింది" అన్నాడు నజీర్, సీటులోంచి లేచి నిలబడి.

నజీర్ పిలుపుతో మదీనా ఆలోచన ఆగిపోయింది. ఉలికిపడి చుట్టూ చూసింది. బస్సు కాలేజీ ఆవరణ ముందు ఆగింది. ప్రయాణీకులు కొందరు బస్సు దిగి వెళ్ళిపోతున్నారు. మదీనా గబుక్కున సీటులోంచి లేచింది. నజీర్‌తోబాటు బస్సుదిగి కాలేజీకి వెళ్ళి పోయింది.

* * *

"... ఆదిమ సమాజంలో మానవులంతా సమానంగా ఉండే వారు. అందరు కలిసి కృషి చేసేవారు. కృషి ఫలితాన్ని కలిసి అనుభవించేవారు. ఇలా కొన్ని శతాబ్దాలు గడిచిన తరవాత పనులను బట్టి వృత్తులు, వృత్తులను బట్టి కులములు ఏర్పడినాయి. మరికొంతకాలానికి కులములలో వృత్తుల ననుసరించి ఉత్తమాధమ భేదాలు ఉత్పన్న మైనాయి. అందువల్ల కులములు శాఖోప శాఖలుగా విడిపోయాయి. ఇలా విడిపోయిన కులములలో ఒకే కులస్థులు ఒకే వృత్తి నవలంభించడం, ఆచార వ్యవహారాలలో కట్టుబడి ఉండడం, ఇతర కులస్తులతో సంబంధ బాంధవ్యాలను విడనాడడంచేత ప్రతి కులం చుట్టూ బ్రహ్మాండమైన కోట గోడలాగా ఈర్ష్య ద్వేషాలు పెరిగిపోయాయి. అందువల్ల ఈ కుల పద్ధతిని సంపూర్ణంగా నశింపజేయడం కాని లేక కాలానుగుణంగా సంస్కరించడం గాని జరిగి తీరవలెనని పలువురు భావిస్తున్నారు ..."

"మే ఐ కమిన్, సర్?" ఇంతసేపు క్లాస్‌రూమ్ ముందు వరండాలో నిలుచున్న మదీనా విసుగుగా అంది.

"జస్ట్ వన్ మినిట్, ప్లీజ్!" సివిక్స్ పాఠం చెబుతున్న నజీర్ ఆదరా బాదరాగా పాఠం పూర్తి చేసి నోట్‌బుక్ తీసుకొని చకచకా బయటికివచ్చాడు. కర్‌చీఫ్‌తో ముఖం మీది చెమటను తుడుచుకుంటూ మదీనా వంక చూశాడు.

గులాబిరంగు వుల్ వాయిల్ చీర. నీలిరంగు రూబీ వాయిల్ రవిక. రెండు జడల మధ్య మత్తెక్కించే సౌరభాన్ని విరజిమ్ముతూ మల్లె పూలమాల. మెడలో మంచి ముత్యాలహారం. చెవులకు రివిట్ రింగులు. చేతికి రిస్ట్‌వాచి. కాళ్ళకు కాన్వాస్ చెప్పులు. మిసమిసలాడుతూ పసిడి కాంతు లీనుతున్న శరీర ఛాయ. దివి నుండి భువికి దిగివచ్చిన దేవతలా ఉంది మదీనా.

"మీ పీరియడ్ అయిపోయింది కూడా గుర్తుంచకుండా కుల పద్ధతిని సంపూర్ణంగా నాశనం చేస్తున్నా రేమిటండీ?" అంది మదీనా వెటకారంగా.







"మీరు కాపాడుదామని వచ్చారా?" అన్నాడు నజీర్ ఎత్తిపొడుపుగా.

"లేదండి. మళ్ళీ పుట్టకుండానే చేయాలని వచ్చాను."

"అయితే అపర కాళికాదేవిగారికి సుస్వాగతం! ఇంతకూ కులంమీద మీ కెందుకండి అంతకోపం?"

"కులం సమాజంలో వ్యత్యాసాలను సృష్టించి పచ్చని కాపురాలను కూలదోస్తుంది. కాబట్టే ఈ అవతారం ఎత్తాను, నరుడా!"

"అయితే కులం ఎలా నశిస్తుంది, దేవీ?!"

"యువతీ యువకులంతా కలిసి కట్టుగా కృషి చేస్తే తప్పకుండా నశిస్తుంది, స్వామీ!"

"అలాగా! అయితే ఈ విషయంలో మీరు నాకు తోడు ఉంటారా?"

"ఓ. ఎస్. ఏ విషయంలోనైనా తోడుఉంటాను."

"నిజం?!"

"నిజమే నండి."

"థాంక్యూ, మేడమ్!" అంటూ నజీర్ అప్రయత్నంగానే మదీనా చేయి పుచ్చుకుని కుదిపాడు.

"థాంక్యూ వెరీమచ్!" అంది మదీనా సంతోషంగా. క్షణం సేపు ఇరువురి చేతులు కలిశాయి. ఒకరి ముఖం ఒకరు చూసుకుని నవ్వుకున్నారు. అనిర్వచనీయమైన అనుభూతిని పొందారు.

మదీనా మెత్తని చేయి పట్టుకోగానే నజీర్ ఒళ్ళు పులకరించింది. కరెంటు షాక్ తగిలినట్లుగా నరాలన్నీ జివ్వుమన్నాయి. వెంటనే మదీనా చేయిని వదిలి పెట్టాడు.

"సారీ, మేడమ్!" అంటూ పేలవంగా నవ్వాడు.

"నో మెన్షన్" అంటూ మదీనా చిరునవ్వుతో ఉత్సాహంగా క్లాస్ రూంలోకి వెళ్ళిపోయింది.

• • •

మదీనా చాలా అందంగా ఉంటుంది. ఉద్యోగం చేస్తూంది. కాని,ఇంతవరకు పెళ్ళిచేసుకోలే దెందుకని? మదీనాకు ఏ సంబంధమూ రాలేదా? అసలు మదీనా తనతో చనువుగా మాట్లాడడానికి కారణం ఏమిటి? మదీనా తనను ప్రేమిస్తూందా? ... ఈ ప్రశ్నలు అనుక్షణం నజీర్ మనసును వేధించ సాగాయి. ఎన్నోసార్లు మదీనాను ఈ ప్రశ్నలకు సమాధానం అడగాలనుకున్నాడు. కాని, అడగలేక పోయాడు.

"ఏమండి, సార్! ఇంకా కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నా రేం? మీ పీరియడ్ బిగిన్ అయిందిగా?" లెక్చరర్స్ రూమ్‌లోకి ప్రవేశిస్తూ అంది మదీనా.

"ఈ రోజు నా మనసేమీ బాగాలేదు, మదీనా... క్లాస్‌కు అటెండ్ కాలేను." తలపట్టుకొని బాధగా అన్నాడు నజీర్

"తల నొప్పిగా ఉందా?" గాభరాగా అడిగింది మదీనా.

"లేదు."

"జలుబు చేసిందా?"


"లేదు."

"జ్వరం వచ్చిందా?"

"లేదు."

"మరి?!"

"ఏమీ లేదు కాని, నాకు కాస్త మనస్సు చేస్తే



## బరువు పరువు

ఒక జంట మొదట ఈడు జోడుగా బాగానే ఉండేవారు. కానీ, కొన్నాళ్ళకు భర్త అపరిమితంగా లావెక్కటం ప్రారంభించాడు. వాళ్ళిద్దరూ వెళుతూంటే పీపా పక్కన సీసా ఉన్నట్లుందని స్నేహితులు గేలి చెయ్యటం సాగించారు.

అతగాడికి పౌరుషం వచ్చింది. బరువు తగ్గాలని గుర్రపు స్వారీ ఆరంభించాడు. నెల రోజులు గడిచాక అతని భార్యను ఒక స్నేహితురాలు అడిగింది:

"మీ ఆయన గుర్రపు స్వారీ ప్రారంభించి నెల రోజులయింది గదా. గుణం కనిపించిందా?"

"ఎందుకు కనిపించలా? గుర్రం బరువు పది కిలోలు తగ్గింది!" అని ఆమె సమాధానం చెప్పింది.

—భారతి

నీ కెందుకింత బాధ, మదీనా?" మదీన ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు నజీర్.

మదీనా మాట్లాడకుండా తల దించుకుంది.

"నీవు ఏమీ అనుకోనంటే నిన్నొక విషయం అడగాలనుకుంటున్నాను, మదీనా!"

"అడగండి."

'నీవు ఇంతవరకు ఎందుకని పెళ్ళి చేసుకోలేదు?"

మదీనా ఉలికి పడింది. నజీర్ కళ్ళలోకి బాధగా చూసింది. తన అందాన్ని చూసి అందరి లాగే నజీరో తనను ప్రేమించ వచ్చు. కాని, తన పరిస్థితి తెలిసిన తరవాత అలాగే ప్రేమిస్తాడా? ప్రేమించినా పెళ్ళికి అంగీకరిస్తాడా?"

"ప్లీజ్ మి. డోంట్ థింగ్ అదర్‌వైజ్."

"నేను ఎవరికి నచ్చక పోవడం వల్ల."

"అరె! నీవు అందంగానే ఉన్నావుగా? !"

"అందం ఉంది. కాని, కులం లేదు."

"అయితే. . . నీవు ముస్లిం కావా?"

"నేను ముస్లింనే. కాని, మా అమ్మ కాదు."

"అంటే?"

"మా అమ్మ హిందువు. ఒక ముస్లిం ను ప్రేమించింది. ఫలితంగా నేను పుట్టాను."

"ఇప్పుడు మీ అమ్మా, నాన్నా ఉన్నారా?"

"అమ్మ ఉంది. కానీ నాన్న లేడు. ఆ నాడు నైజాం రజాకార్ మూమెంట్‌లో మరణించాడు. ఇక అప్పటినుండి మా అమ్మ ఎన్నో కష్టాలు పడి నన్ను పెంచి పెద్దదాన్ని చేసింది. ఈ ఉద్యోగం వచ్చేంతవరకు చదువుకూడా చెప్పింది.''

''అలాగా? అయితే'' ఇప్పుడు మీ అమ్మ ఎక్కడుంది?"

"నా దగ్గరే ఉంది."

"నీ దగ్గర ఉందా?"

"అవును. ఏం?"

"మీ అమ్మ నీ దగ్గర ఉంటే నిన్నెవరు గౌరవిస్తారు?"

"ఎందుకని?"

"నీవు కులం లేని దానివని. . ."

కులప్రసక్తి రాగానే మదీనా హృదయం భగ్గుమంది. భరించరాని కోపం వణికిపోయింది. టేబుల్ మీది పేపర్ వెయిట్ తీసుకుని నజీర్ ముఖం పగిలేలా కసికొద్దీ కొట్టాలనుకుంది. కాని, తను నజీర్‌ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తూంది. పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటూంది. అందుకని తన కోపం తనలోనే అణచుకుంది.

"అమ్మకు దూరంగా ఉంటే కులం వస్తుందా?"

"కులం రాకపోయినా సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి."

"కన్నతల్లిని దూరం చేసే ఆ గౌరవ మర్యాదలు నా కవసరం లేదు."

"అలాగైతే నిన్నెవరు పెళ్ళి చేసుకుంటారు?"

"హు. నేను కులం లేని దానినని నన్నెవరూ పెళ్ళి చేసుకోకపోయినా నా కేం దిగులు లేదు. ఈ ప్రపంచంలో పుట్టిన వాళ్ళంతా పెళ్ళి చేసుకుని పిల్లలను కనాల నేముంది? నేను బ్రహ్మచారిణిగా ఉంటాను."

"బలవంతంగా కోరికలను చంపుకుని బ్రహ్మచారిణిగా ఉంటూ నీ అందాన్ని అడవి గాచిన వెన్నెల చేసుకోవడం వల్ల ప్రయోజనం ఏముంది?"

"మా అమ్మ లేకపోతే నాకు ఈ అందం, చదువు, ఉద్యోగం ఎలా వచ్చేవి? అసలు నేను ఈ ప్రపంచంలోకి ఎలా వచ్చేదాన్ని? మా అమ్మ ఎలాంటిదైనా నాకు దైవ సమానురాలు. ఆమె సుఖం కోసం, సంతోషం కోసం నా జీవితాన్ని త్యాగం చేస్తాను." కసిగా అంది మదీనా.

"అయితే నీకు భర్త కంటే తల్లి ముఖ్యమా?"

"అవును. నా దృష్టిలో నన్ను సృష్టించిన నా తల్లి తరవాతనే భర్త. నా తల్లి నన్ను నవమాసాలు మోసి, కని పెంచి పెద్దదాన్ని చేయకపోతే నాకు భర్త ఎలా వస్తాడు?"

మదీనా మాటలకు నజీర్ మనసు గిరున తిరిగింది. లాగి ఎవరో చెంపదెబ్బ కొట్టినట్లనిపించింది. అతని హృదయం భరించరాని బాధతో విలవిలలాడింది. మనసు పరిపరి విధాల ఆలోచించ సాగింది. 'అవును. మదీనా అన్న మాటలు అక్షరాలా నిజం. అమ్మ నన్ను నవ మాసాలు మోసి, కని, పెంచి పెద్దవాడిని చేసి చదువు చెప్పించక పోతే నాకు ఈ ఉద్యోగం ఎలా వచ్చేది? నేను నలుగురిలో మనిషి లాగా ఎలా తిరిగే వాడిని? అసలు ఈ ప్రపంచంలోకి ఎలా వచ్చేవాడిని? రాలేను. అందువలన అత్యుత్తమమైన ఈ మానవ జన్మ నాకు లేకుండా పోయేది. కాని. తను మదీనా లాగా అమ్మను గౌరవిస్తున్నాడా?

మఖ పెడుతున్నాడా? లేదు. ఎందుకని? ఆ నాడు కాలేజిలో తనను గాఢంగా ప్రేమించిన మాలవ్ పెళ్ళికి నిరాకరించడం వలన అవును. ఆ నాడు. . .,

• • •

"హలో, మాలన్! ఈ రోజు పార్కుకు నా కంటే ముందే వచ్చావు. ఏమిటి విశేషం?" అంటూ వెళ్ళి మాలవ్ పక్కన బెంచి మీద కూర్చున్నాడు నజీర్.

మాలవ్ మాట్లాడలేదు.

"లేటుగా వచ్చానని కోపం వచ్చిందా?" మాలవ్ నన్నని నడుము చుట్టూ చేయి వేసి దగ్గరికి తీసుకున్నాడు.

మాలవ్ బాధగా ముఖం పక్కకు తిప్పుకుంది.

"ఏమిటి, మాలవ్? ఏమైంది? మన మారేజి విషయం మీ ఫాదర్‌తో చెప్పావా?" ఆదుర్దాగా అడిగాడు నజీర్.

"చెప్పాను" అంది మాలవ్ ముక్తసరిగా.

"ఏమన్నాడు?"

"మీరు ప్యూర్ ముస్లిం కారట."

"అంటే?"

"మీ ఫాదర్ ముస్లిం. మీ మదర్ హిందువట."

"అవును. అయితే ఏం? నాకు కులం లేకపోయినా గుణం ఉంది, మాలవ్. నీవు కాలేజిలో చదువుతూ కూడా కుల మతాలను పాటించడం చాలా శోచనీయం" అన్నాడు నజీర్, తనకు తాను సమర్థించుకుంటూ.

"నేను మనస్ఫూర్తిగా ప్రేమించింది మీ కులం చూసి కాదు, గుణం చూసి. కాని, మా ఫాదర్ గుణంతో బాటు కులంకూడా కావాలంటాడు."

"మీ ఫాదర్‌కు నచ్చ చెప్పలేకపోయావా?"

"చెప్పాను. కాని, వినిపించుకోలేదు."

"అయితే మీ ఫాదర్‌కు తెలియకుండా మనం రిజిస్టర్ మారేజి చేసుకుందాం."

"ప్లీజ్! ఎక్స్‌క్యూజ్ మి, నజీర్! మా ఫాదర్‌కు నేను ఒక్కగా నొక్క కూతురును. చిన్ననాటి నుండి నన్ను చాలా గారాబంగా పెంచాడు. ఇప్పుడు అతని మాట కాదని నేను నిన్ను మారేజి చేసుకో లేను."

"నేను కులంలేని వాడిని కాబట్టి నన్ను మారేజి చేసుకోవడం నీకే ఇష్టం లేదని ఒక్క మాట చెప్ప రాదూ? మీ ఫాదర్‌కు ఇష్టం లేదని చెప్పడం దేనికి?"

"ఎలా చెప్పను, నజీర్? నేను నిన్ను ఆరాధ్య దైవంగా ప్రేమిస్తున్నను. మా ఫాదర్‌ను కన్న తండ్రిగా ప్రేమిస్తున్నాను. కాని, నేను నిన్ను పెళ్ళి చేసుకుంటే మా ఫాదర్ విషం తాగి చనిపోతా నంటున్నాడు. నీకు కులం లేని కారణం చేత నీ మీది ప్రేమను వదులుకోలేక, మా ఫాదర్ మీది ప్రేమను వదులుకోలేక నే నెంత బాధ పడుతున్నానో నీ కేం తెలుసు? ఇప్పుడు నేను చెప్పినా నీకు అర్థం కాదు."

"అంతగా నన్ను ప్రేమించిన దానివైతే నాతో లేచి రాకూడదా? మీ ఫాదర్‌కు కనుపించకుండా ఎక్కడో దూరంగా హాయిగా బ్రతక వచ్చుగదా?"

"అయామ్ సో సారీ, మిస్టర్ నజీర్! మా ఫాదర్‌ను చంపుకుని వచ్చి నీతో కాపరం చేయ లేను. కులం నా చుట్టూ కనిపించని బ్రహ్మాండమైన కోట గోడను నిర్మించింది. ఆ కోట గోడను దాటి నేను నీ దగ్గరికి రాలేను. నీవు నా దగ్గరికి రాలేవు. ఇక ఈ జన్మలో మన ప్రేమ ఫలించదు. ఇంతవరకు మనం గడిపిన మధుర క్షణాలన్నీ కలగా భావించండి. దయచేసి నన్ను మరిచి పొండి" అంటూ మాలవ్ బాధగా ముఖం పక్కకు తిప్పుకు వెక్కి వెక్కి ఏడిచింది.

"నీవు నన్ను మరిచిపోయినా నేను నిన్ను మరిచి పోలేను, మాలవ్! జీవితాంతం నిన్ను తలుచుకుంటూ బ్రహ్మచారిగానే ఉండి పోతాను" అన్నాడు నజీర్ దిగులుగా శూన్యంలోకి చూస్తూ.

"నేను మాత్రం నిన్ను ఎలా మరిచిపోగలను, నజీర్? స్త్రీ జీవితంలో ఒకడినే ప్రేమిస్తుంది. ఆ ప్రేమించిన వ్యక్తి దూరమైనప్పుడు జీవితాంతం కుమిలి కుమిలి ఏడుస్తూ మరణిస్తుంది. నేనూ అంతే. నజీర్. . . నేనూ అంతే" అంటూ మాలవ్ పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ చరచరా వెళ్ళిపోయింది.

నజీర్ నిశ్చేష్టుడై నిలబడి పోయాడు.

• • •

మాలవ్‌ను ప్రేమిస్తున్నప్పుడు నజీర్ ఎన్నో కలలు గన్నాడు. తనకు ఆస్తి పాస్తులు లేకపోయినా మాలవ్‌కు పుష్కలంగా ఉన్నాయి. మాలవ్ జాగీర్దార్ ఏకైక కుమార్తె. తను జాగీర్దార్ అల్లుడు. రాజధానిలో ఉన్న పెద్ద మహల్‌లో మాలవ్‌తో తను సరదాగా గడుపుతాడు. కారులో మాలవ్‌తో కలిసి షికారు వెళ్ళుతాడు. ప్రకృతి సౌందర్యంతో శోభించే ప్రదేశాలన్నీ పరిశీలిస్తాడు. ఇలా వూహించుకుని ఎన్నో గాలి మేడలు కట్టుకున్నాడు. కాని, తను కట్టుకున్న గాలి మేడలన్నీ కూలిపోయాయి. తను కులం లేని వాడు కావడం వల్ల మాలవ్ తనకు దక్కకుండా పోయింది.

మనసారా ప్రేమించిన మాలవ్ పెళ్ళికి నిరాకరించిన తరవాత కులం లేని వాడుగా తనను కన్నందుకు కన్నతల్లి మీద నజీర్‌కు అంతులేని అసహ్యం కలిగింది. కన్నతల్లి అన్న కనికరం లేకుండా పోయింది. గొంతు నులిమి చంపి వేయాలన్నంత కసి పుట్టింది. పట్టరానంత కోపం వచ్చింది. ఆ కోపంతో తల్లిని నోటికి వచ్చినట్టు నానా మాట లన్నాడు. అవమానించాడు. చివరికి ఉద్రేకాన్ని ఆపుకోలేక చెంప దెబ్బకూడా కొట్టాడు. కన్న తల్లికి దూరంగా ఉంటే సమాజం తనను కులం లేని వాడుగా పరిగణించకుండా గౌరవిస్తుందన్న ఉద్దేశంతో ఆమెకు చెప్పకుండానే ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. ఆ నాటి నుండి ఈ నాటి వరకు ఇంటికి వెళ్ళలేదు. కనీసం ఒక ఉత్తరంకూడా వ్రాయలేదు.

పశ్చాత్తాపంతో అతని మనసు పరితపించ సాగింది.

'అంతస్తును గుర్తించకుండా అందని మాలవ్ సిరిసంపదలకు ఆశ పడి అవమానాల పాలయ్యాను. కులం లేని వాడి ననిపించుకోకుండా గౌరవంగా బ్రతక గలని భ్రమ పడినాను. అనవసరంగా అమ్మను

మీరెంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి నవలలు..




సీతాపతి (డిసెంబర్ 14వ విడుదల) రూ.12·50
ప్రేమసింహాసనం (జనవరి 16న విడుదల) 15·00




మీ దగ్గరలో వున్న బుక్ షాపులో అడగండి! లేదా -
ఒక పుస్తకం కావలసినా, రెండు పుస్తకాలు కావలసినా 1 రూపాయి తగ్గించి M.O. చేయండి. ఆరూపాయికి V.P.లో పంపగలం

నవసాహితి బుక్ హౌస్ ఏలూరు రోడ్. విజయవాడ - 520 002

దూరం చేసుకున్నాను. నేనెంత దుర్మార్గుణ్ణి! నా లాంటి వాడిని చంపినా పాపం లేదు. పాపం అమ్మ ఏకాకిగా ఉంటూ ఎంత బాధ పడుతూందో? నా కోసం ఎంత కుమిలి కుమిలి ఏడుస్తూందో? తను ఈ రోజే ఇంటికి వస్తున్నానని అమ్మకు ఉత్తరం వ్రాయాలి. ఉత్తరం చూసి అమ్మ చాలా సంతోషిస్తుంది. తన కోసం వేయి కళ్ళతో ఎదిరి చూస్తుంది.'

"ఏమిటి, దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అడిగింది మదీనా.

"ఆ. ఏం లేదు. నీవు తల్లిని దేవత లాగా పూజిస్తూ గౌరవిస్తున్నందుకు సంతోషిస్తున్నాను." ఆలోచనలో నుండి తేరుకుని అన్నాడు నజీర్.

"సృష్టికి మూల కారకురాలైన అమ్మను ఆదరించకుండా ఆలయానికి వెళ్ళి పూజలు పునస్కారాలు చేయడం వల్ల ఫలితం ఏముంటుంది? అందుకే తల్లిని మించిన దైవం లేదంటారు."

"స్త్రీకి పతియే పరమాత్మ అంటారు కదా మరి, నీ భర్తనుకూడా అలాగే గౌరవిస్తావా?"

"కుల మత భేదాలతో నిమిత్తం లేకుండా భార్యగా నన్ను గౌరవించినంత కాలం భర్తగా అతనిని గౌరవిస్తాను."

మదీనాకు ఆస్తిపాస్తులు లేకపోయినా చాలా అందంగా ఉంటుంది. తెలివిగలది. చదువుకున్నది. ఉద్యోగం చేస్తున్నది. మదీనాకు కులం లేదు. తనకూ కులంలేదు. మదీనా తనను ప్రేమిస్తున్నది. తను మదీనాను ప్రేమిస్తున్నాడు. మదీనాకు పెళ్ళి కాలేదు. తనకు కాలేదు. మదీనా తనను పెళ్ళి చేసుకుంటుందేమో?... అడగాలి... అడిగితే ఏమనుకుంటుందో, ఏమో?... అడగక పోతే ఒకరి ఉద్దేశం ఒకరి కెలా తెలుస్తుంది?... అందుకని అడగాలి... అవును అడగాలి...

"నీకు అభ్యంతరం లేకపోతే, నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను... ఏమంటావు?..." తడబడుతున్న గొంతుతో నెమ్మదిగా అడిగాడు నజీర్.

ఈ మాటకు మదీనా ఉలికి పడింది. ఒక్కసారిగా గుండె దడదడ లాడింది. ఇంతకాలం నుండి ఎవరికీ చిక్కకుండా దాచుకున్న పవిత్రమైన శీలాన్ని దోచుకుంటున్నట్లుగా, తన అందచందాలన్నీ నజీర్ కౌగిలిలో నలిగిపోతున్నట్లుగా బాధ పడింది. ఆ బాధ వెనక అనిర్వచనీయమైన ఆనందానుభూతిని పొందింది.

సాలార్ జంగ్ మ్యూజియంలోని పాలరాతి విగ్రహంలాంటి మదీనా అందచందాలను చూసి ఎందరో ముస్లిం యువకులు పెళ్ళి చేసుకుంటామని. ముందుకు వచ్చారు. కాని, మదీనాకు కులం లేదని తెలియగానే అసహ్యించుకొని అనుభవించడానికి ప్రయత్నించారు. కులం లేకపోయినా మానాభిమానాలు కల మదీనా ఎవరికి లొంగలేదు. ఇప్పుడు తను కులం లేనిదని తెలిసిన తరవాత కూడా నజీర్ పెళ్ళి చేసుకుంటాననగానే మదీనాకు ఆశ్చర్యం వేసింది.

"ఈ మాట మీరు బాగా ఆలోచించే అంటున్నారా?" నజీర్ కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది మదీనా.

"బాగా ఆలోచించే అంటున్నాను."

"పోస్ట్!" పోస్టుమాన్ ఒక కవరు నజీర్‌కు ఇచ్చి వెళ్ళిపోయాడు.

నజీర్ కవరు చించి చూశాడు. ఆత్రతగా చదివాడు. ఉత్తరం చదువుతున్నంత సేపూ అతని ముఖంలో కత్తి వేసినా రక్తపు చుక్క లేదు. కాళ్ళు చేతులు కంపించ సాగాయి. శరీరమంతా చెమటతో తడిసిపోయింది.

"ఏమిటి, నజీర్, ఏమైంది?" మదీనా ఆదుర్దాగా అడిగింది.

ఏ విధమైన సమాధానం చెప్పకుండానే నజీర్ ఉత్తరం మదీనా చేతికిచ్చి కుర్చీలో చేరగిలపడి పోయాడు. పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నించసాగాడు.

మదీనా ఉత్తరం తీసుకొని గబగబా చదువ సాగింది.

"చిరంజీవి నజీర్‌కు హృదయపూర్వకమైన ఆశీస్సులు. బాబూ! నా రక్తాన్ని పంచుకొని, నా కడుపు చించుకొని, నా పాలు తాగి పెరిగి పెద్దవాడివైన నీవు, చివరికి నన్ను అవమానించి, నా మీద నేరం వేసుకొని, నా హృదయాన్ని బద్దలు చేసి, నాకు చెప్పకుండా వెళ్ళిపోవడానికి నీ మనసెలా అంగీకరించింది? నిన్ను కని, పెంచి, పెద్దవాడిని చేసి, చదువు చెప్పించి, సమాజంలో నీవు సుఖంగా, గౌరవంగా బ్రతకడానికి నేను ఎంత శ్రమ పడినానో, ఎన్ని నిందలను అవమానాలను భరించానో నీకు తెలియదు. ఇప్పుడు చెప్పినా నీకు అర్థం కాదు. అంతా ఆ భగవంతునికే తెలుసు. కాని, నీవు చదువుకొని, ఉద్యోగం చేస్తూ కూడా నా బాధను అర్థం చేసుకోలేకపోవడం నా దురదృష్టం.

"ఆనాడు నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చిన మీ నాన్న నీవు గర్భంలో ఉన్నప్పుడు తల్లిదండ్రుల మాటలు విని వాళ్ళ బంధువులలో ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. భార్యతో బాటు నన్ను కూడా ఉండమన్నాడు. కాని, పెళ్ళి చేసుకోకుండా అతనికి ఉంపుడు కత్తెగా ఉండడం నాకు ఇష్టం లేక పోయింది. ఫలితంగా ఇరువురము విడిపోయాం. ఇక అప్పటి నుండి నన్ను లోకం నీచంగా చూసినా, నిందించినా భరించుతూ, నీ మీద ఆశ పెట్టుకొని ఇంతకాలం బ్రతికాను. కాని. లోకంతో బాటు నీవు కూడా నన్ను నిందించిన తరవాత ఇక నాకు ఈ ప్రపంచంలో ఎవరు దిక్కు? ఇంతచేసినా నా వల్ల నీకు సుఖానికి బదులు కష్టం కలుగుతున్నప్పుడు ఇక నేను బ్రతకడం అనవసరం. అందుకని నీ సుఖం కోసం, సంతోషం కోసం ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళిపోతున్నాను సెలవు. ఇట్లు, నీ అమ్మ— జానకమ్మ."

"అబ్బా! ఎంత పని చేశారండీ! చదువు, సంస్కారం ఉండి కూడా కన్నతల్లిని ఇంతనీచంగా అవమానించడానికి మీ మనసెలా అంగీకరించింది?" మదీనా బాధగా అడిగింది.

"నాకు ఎంత చదువు, సంస్కారం ఉన్నప్పటికీ నేను కులం లేని వాడిని కాబట్టి సమాజంలో నీచుడుగా పరిగణించబడినాను. నా ఎదుట నన్ను పొగిడిన వారే నా వెనక నన్ను నిందించారు. మనస్ఫూర్తిగా నన్ను ప్రేమించిన యువతి పెళ్ళికి నిరాకరించింది. ఆ తరవాత ఎన్నో సంబంధాలు వచ్చాయి. వచ్చినట్లే వెళ్ళిపోయాయి. అందువల్ల నాకు అమ్మమీద అసహ్యం కలిగింది. ఆమెకు ఎంత దూరంగా ఉంటే అంత గౌరవంగా బ్రతకగలనని భావించాను. కాని, ఎంతదూరం పోయినా కులం కాలనాగులా వెన్నంటుతూనే ఉంది. చివరికి అమ్మ విలువ అర్థమయేసరికి అమ్మ అందకుండా పోయింది." కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు నజీర్.

"అంతా అయిపోయిన తరవాత ఇప్పుడనుకుంటే ఏం లాభముండి? కులమతాలను పెంచిపోషించే ఈ సమాజంలో కులంలేనివాళ్ళు బ్రతకడంచాలాకష్టం. కాబట్టి బూజుపట్టిన భావాలతో నిండిన నేటి సమాజం రేపటి నవసమాజంగా—అంటే కులమత భేదాలులేని వర్గ రహిత సమాజంగా మారినప్పుడు మనలాంటి కులంలేని వాళ్ళు కూడా గౌరవంగా బ్రతుకుతారు. అలా బ్రతకడం కోసమే మనం పోరాడాలి..." నజీర్ మీద చేయిపెట్టి ఓదారుస్తూ అంది మదీనా.

నజీర్ దిగులుగా కూర్చుండిపోయాడు.

గంట గణగణ మ్రోగింది. మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. విద్యార్థులందరూ గుంపులు గుంపులుగా ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

"మా అమ్మ భోజనం చేయకుండా నా కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. మా ఇంటికి పోదాం రండి!" అంది మదీనా ఆప్యాయంగా నజీర్ చేయి పట్టుకొని.

నజీర్ మారు మాట్లాడకుండా మదీనా వెంట వెళ్ళిపోయాడు. *



## రహస్యం

ఒకజంట తమ స్నేహితుల్ని విందుకు పిలిచారు. విందు పూర్తయ్యాక ఒక స్నేహితుడు మాత్రం మిగిలాడు.

కాసేపయ్యాక గృహస్థు తన భార్యను—"నీళ్ళు పెట్టావా? కాగినయ్యా? రమ్మంటావా" అని అడిగాడు.

"ఇంకా లేదు. ఒక పది నిమిషా లాగండి" అని ఆమె సమాధాన మిచ్చింది.

అది విన్న స్నేహితుడికి ఆశ్చర్యం వేసి "అదేమిటిరా.. భోజనం అంతా అయ్యాక ఇప్పుడు స్నానం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"స్నానం కాదు, మహాశయా. వేణ్ణీళ్ళలో ఉంచుతేనేగాని పాత్రల జిడ్డు వదలదు" అంది అప్పుడే వేణ్ణీళ్ళు పొయ్యి మీద పెట్టి వస్తున్న గృహిణి.